'సువిధ' దరఖాస్తులకు అనుమతులు జారీచేయాలి

రాష్ట్ర ఎన్నికల అదనపు సీఈవో లోకేశ్

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 13 : ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం సువిధ యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తూ సకాలంలో అనుమతులు జారీచేయాలని రాష్ట్ర ఎన్నికల అదనపు సీఈవో లోకేశ్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లతో ఆయన సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. సువిధ యాప్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనలకు లోబడి ఉన్న వాటికి నిర్ణీత గడువులోగా అనుమతులు జారీ చేసేలా చొరవ చూపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,429 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని పరిష్కరించాలని సూచించారు.

సీ-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి మద్యం, నగదు పంపిణీ చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈనెల 15న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట తదుపరి ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు సన్నద్ధమై ఉండాలన్నారు. అభ్యర్థుల పేర్లు, గుర్తుల కేటాయింపు తదితర పనుల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వ్యవహరించాలని అన్నారు. 18న ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తిచేయాలని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ సైతం చేపట్టాలని అన్నారు. జూమ్ మీటింగ్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఈడీఎం కార్తీక్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది శ్రీనివాస్, పవన్, రషీద్, సాత్విక్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్, అధికారులు

అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్‌కు పోలీసుల నోటీసు

నిజామాబాద్ క్రైం, నవంబర్ 13 : భారతీయ జనతా పార్టీ అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాతో అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానంటూ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ సవాలు చేయడంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులు ఎవరూ రెచ్చగొట్టే విధానాన్ని అవలంబించవద్దని సూచించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తే విధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.

గ్రంథాలయ వారోత్సవాలు రద్దు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 13 : ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించాల్సిన గ్రంథాలయ వారోత్సవాలను ఈ ఏడాది రద్దు చేస్తున్నట్లు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో వారోత్సవాలను రద్దుచేసినట్లు పేర్కొన్నారు.

కాళోజీకి ఘన నివాళి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 13 : కాళోజీ నారాయణరావు వర్ధంతిని నగరంలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నగరంలోని గాజుల్‌పేట్‌లో ఉన్న కాళోజీ విగ్రహానికి కవులు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవి ప్రేమ్‌లాల్ మాట్లాడుతూ.. కాళోజీ తెలంగాణ వైతాళికుడని, భాష, యాస ద్వారా ఎన్నో కవితలు, రచనలు చేసిన గొప్ప తెలంగాణ వాది అని కొనియాడారు. కార్యక్రమంలో వేముల శేఖర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత విభావరి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 13 : నగరంలోని కోటగల్లీలో ఉన్న సరస్వతీ శిశు మందిర్‌లో గాన సరస్వతీ సుశీల పుట్టినరోజు సందర్భంగా స్వరసౌరభం -ఇందూరు ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత విభావరిని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు మాట్లాడుతూ.. సుశీలమ్మ 1950 - 1990 కాలంలో దక్షిణ భారతదేశంలో నేపథ్య గాయకురాలిగా ఎదిగారని, ఎన్నో అద్భుతమైన పాటలు పాడారని కొనియాడారు. 5 జాతీయ పురస్కారాలు అందుకున్నారని, తెలుగుతోపాటు వివిధ భాషల్లో 52 వేలకుపైగా పాటలు పాడారని తెలిపారు. ఎస్.రాములు, నాగరాజు శర్మ, మాధురి తదితరులు ఆమె పాడిన పాటలను పాడి వినిపించారు.

గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

బిగాల ఆధ్వర్యంలో చేరికలు

ఖిలీల్‌వాడి, నవంబర్ 13 : అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని నాగారం గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బిగాల సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బిగాల గణేశ్ గుప్తా గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఎల్లమ్మగుట్టలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెల్డింగ్ నారాయణ, ధర్మపురి మల్లేశ్ యాదవ్, అక్బర్ హుస్సేన్, నిచెంగ్ కృష్ణ, దీల్లోడ్ ఆకాశ్, తుమ్మ నాగభూషణం, భారీ శ్రీనివాస్‌గౌడ్, కస్తూరి గంగరాజు, పుంద్ర నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ అంశాలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు తాన్యాసింగ్

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 13 : బోధన్, బాన్సువాడ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల వ్యయ అంశాలపై తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల వ్యయ పరిశీలకుడు తాన్యాసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలతో ముడిపడిన ఏ విషయమైనా తన దృష్టికి తీసుకరావచ్చని ప్రజలకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు (సెలవు దినాల్లో మినహాయించి) తాను బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తనను నేరుగా కలిసి ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, సలహాలు, సూచనలు కూడా అందించవచ్చని స్పష్టం చేశారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు 8332021892 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు పరిశీలన

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు శక్తి

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 13 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును ఆయా నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు శక్తి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాల్కొండ, ఆర్మూర్ పట్టణాలతోపాటు మాక్లూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిర్వహిస్తున్న తనిఖీ, ఇతర కార్యకలాపాలను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ నిఘా కొనసాగించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఉషూ పోటీల్లో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 13 : మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఊషూ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగీతా రావు తెలిపారు. షేక్ అయాన్, అబ్దుల్ కైఫ్, హైక్ అబ్రార్, జయాద్ ఖాన్ స్వర్ణ పతకాలు సాధించారని తెలిపారు. షేక్ సోహైల్ రజత పతకం, షోయబ్‌ఖాన్, ఫరియా ఖానం కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

సిరికొండ, నవంబర్ 13: మండలంలోని చిన్నవాల్గోట్‌లో ఆదివారం రాత్రి కత్తిపోట్ల కలకలం సృష్టించింది. ఎస్సై రమేశ్ తెలిపిన ప్రకారం.. చిన్నవాల్గోట్ గ్రామానికి రొండ్ల దీపి చందన్‌రెడ్డి అనే యువకుడు బడాల గంగారెడ్డి ఇంటి వద్ద కూర్చొని యజమానితో మాట్లాడుతున్నాడు. ఇంతలో అదే గ్రామానికి చెందిన గౌరి గంగబాపు అక్కడికి వచ్చి చందన్‌రెడ్డిపై కత్తితో దాడి చేశాడు. ఎడమ చేయి, ఛాతి, పొత్తి కడుపు, కుడి భుజంపై కత్తితో పొడిచాడని ఎస్సై తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకొని ప్రత్యక్ష సాక్షులు చెప్పిన ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువకుడిపై దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

KONICA MINOLTA
AUTHORIZED DEALER FOR KONICA MINOLTA
SPECIAL PRICE'S ON 45PP,55PPM,65PPM MONO MACHINES

WISH YOU A VERY HAPPY DIWALI.
PURCHASE ANY 45PPM TO 65PPM MACHINES & GET A SPECIAL GIFT BOX
7658941464, 6281676611
SVS TECHNOLOGIES UMAKANTH COMMERCIAL COMPLEX,2ND FLOOR, OPP BHANDAN BANK, EAST MARREDPALLY
WWW.SVSTECHNOLOGIES.NET

WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.